క్లుప్తంగా

పోలింగ్ శాతం పెంచాలి



ఎన్నికల నిర్వహణపై అధికారులను వివరాలు అడుగుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

పాతపట్నం: సాధారణ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులకు సూచించారు. పాతపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల వివరాలు, పలు రికార్డులను గురువారం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, కాల్ సెంటర్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలను ఆర్ఓ ఎం.అప్పారావును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళిపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం పాతపట్నం పంచాయతీ కార్యాలయం సమీపంలోని బస్టాండ్ వద్ద ఒడిశా నుంచి వస్తున్న కారును తనిఖీ చేశారు. అంతర రాష్ట్ర సరిహద్దులో నిఘా పటిష్టం చేయాలన్నారు. సరిహద్దులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, డీటీ ప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కొత్తూరుకు చెందిన శ్రీవెంకటేశ్వర విద్యా సంస్థల డైరెక్టర్ జి.కృష్ణారావు, గురండి సర్పంచ్ బోర సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని గురండి, పాతపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా గురువారం నాలుగో రోజు పాఠశాలలు, ఆలయాల పరిసరాల్లో వలంటీర్లు మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు ఏడాదికి ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఎన్ఎస్ఎస్ పీఓలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా ఉమాకామేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: పురుషోత్తపురంలోని పార్వతీసమేత ఉమాకామేశ్వర స్వామివారి కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉమాకామేశ్వర ఆలయ వార్షికోత్సవ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయం ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


సత్కారం..



విజయలక్ష్మీబాయిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆమదాలవలస: రెండో అదనపు జిల్లా సెషన్స్, మహిళా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సీనియర్ న్యాయవాది ఆమదాలవలసకు చెందిన చింతాడ సత్యనారాయణను ఆమదాలవలస బార్ అసోసియేషన్ తరఫున న్యాయవాదులంతా గురువారం సత్కరించారు. సత్యనారాయణ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ జిల్లా క్రియాశీల సభ్యుడిగా పనిచేస్తున్నారు. గతంలో బార్ అసోసియేషన్‌లో పలు పదవులు చేపట్టారు. ఆమదాలవలస బార్ అసోసియేషన్ అధ్యక్షురాలినిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కణితి విజయలక్ష్మీబాయికి ఆమదాలవలస బార్ అసోసియేషన్ తరఫున న్యాయవాదులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోవిందరావు, తమ్మినేని అన్నంనాయుడు, కింతలి త్రినాథరావు, సాధు ధనుంజయరావు, పి.వి.నరసింహులు, బుర్లె సీతారాం, కిల్లి మార్కండేశ్వరరావు, హెచ్.అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణ తప్పనిసరి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

జలుమూరు: దంతాల సంరక్షణపై అవగాహన ఉండాలని, ఆరోగ్యంలో భాగంగా వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అచ్యుతాపురం మెడికల్ అధికారి పి.సుజాత, బుడితి సీహెచ్‌సీ డెంటల్ డాక్టర్ సత్యసాయి అన్నారు. ప్రపంచ ఓరల్ హెల్త్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేసుకోవాలని, వైద్యుల సలహా మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈఓ నాయుడు, సిబ్బంది ఉన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

- జగనన్నతోనే జీవన ప్రమాణాల మెరుగు
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పొందూరు: ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. పొందూరు పంచాయతీలోని పోస్టాఫీసు వీధి, కోమటి వీధి, చేనేత వాడలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి కోరారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధిని చేసి చూపించానన్నారు. ప్రజల పక్షాన అన్ని వేళలా నిలబడి ఉంటానన్నారు. ఓటును నిర్భయంగా వేయాలన్నారు. రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి పథంలో నడవాలంటే మరశా జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా గెలిపించుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాకర్ల రాజారావు, బండారు ప్రతాప్‌కుమార్, బాడాన సునీల్‌కుమార్, బొత్స రమణ, గుడ్ల మోహన్, కూన కిరణ్, అనకాపల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. మండలంలోని కుంటిభద్రలో ఎంపీటీసీ సభ్యురాలు అగతమూడి సుశీల నివాసం వద్ద పార్టీ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఐదేళ్లల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ అమలు చేశారన్నారు. పేదలకు న్యాయం జరగాలంటే జగనన్నను మరోసారి సీఎంను చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, అగతమూడి నాగేశ్వరరావు, వసప సర్పంచ్ వలురౌతు ఆఫీస్, కలమట రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపిద్దాం

మెళియాపుట్టి: సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా మళ్లీ గెలిపించాలని పాతపట్నం ఎమ్మెల్యే తనయుడు రెడ్డి ఓంశ్రీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు తేడాలను వివరించారు. పార్టీ మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పోలాకి జయముని రావు, తాళాబత్తుల ప్రసాదరావు, ఎంపీటీసీ పోలాకి జయంతి, పోలాకి తిరుమలరావు, షేక్ సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

తమ్మినేని విజయానికి సహకరించండి

సరుబుజ్జిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ కోరారు. మండలంలోని రావివలస గ్రామంలో సర్పంచ్ వండాన కృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాలసత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కావిలాపు చంద్రశేఖర్, బద్రి రామారావు, తవిటినాయుడు, ఎడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి..

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండలం కోమర్తి పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. అందరూ ఐక్యంగా పనిచేసి మెజార్టీ సాధించాలని, ధర్మాన కృష్ణదాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, సురంగి నర్సింగరావు, రాజాపు అప్పన్న, ఉంగటి రాజు, పంచిరెడ్డి సత్యం, చల్ల స్వామిబాబు, కోల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలి..

పాతపట్నం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ రెడ్డి శాంతిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి శ్రావణ్ కుమార్ కోరారు. గురువారం పాతపట్నం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మార్నింగ్ వాకింగ్ చేస్తున్న వారితో కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. గ్రామ సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, నాయకులు టంకాల సుధ, మజ్జి వరదరాజులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: సంక్షేమ పథకాలను వివరిస్తున్న రెడ్డి ఓం శ్రీకృష్ణ



సరుబుజ్జిలి: రావివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చిరంజీవినాగ్



నరసన్నపేట: మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

కవులను ఆదరించాలి



నరసన్నపేట: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత



ఆమదాలవలస: మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాపద్మిని

నరసన్నపేట: సంతోషంగా ఉన్నా.. విచారంలో ఉన్నా తనలోని భావాలకు అక్షర రూపమే కవిత అని, కవితలు చదవాలని, కవులను ఆదరించాలని నరసన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కవితలు, కవుల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతీ సన్నివేశాన్ని, సంఘటనను కవితల రూపంలో వినిపించి ప్రజలను చైతన్య పరచవచ్చన్నారు. తెలుగు విభాగం అధ్యాపకులు రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ శాంతిహేమ్ తదితరులు పాల్గొన్నారు.

కవితలతో భావాల వ్యక్తీకరణ..

ఆమదాలవలస: భావాలు వ్యక్తీకరించడానికి కవిత్వమే సరైన మార్గమని ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషాపద్మిని అన్నారు. కళాశాలలోని ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిగిలిన కళారూపాలకు లేని విశిష్టత కవిత్వానికి ఉందన్నారు. కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కవిత్వాన్ని చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. వివిధ భాషలలో ఉండే గొప్ప మేధో సంపదను కవిత్వం ద్వారా అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ సాయి కుమార్, అధ్యాపకులు కె.జగన్నాథరావు, బాలరాజు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకే మళ్లీ కండువాలు



మాట్లాడుతున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: ఎంపీ వస్తున్నారు.. టీడీపీలో చేరండి అని వైఎస్సార్‌సీపీ నాయకులతో రాయబరాలు చేశారు.. వారి ప్రయత్నాలు ఫలించకపోవడంతో టీడీపీ కార్యకర్తలకే మళ్లీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరిపోతున్నారని.. టీడీపీ గొప్పలు చెప్పుకుంటుందని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళితోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. గురువారం సాయంత్రం నరసన్నపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు లుకలాపు రవి, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు తదితరులు విలేకర్లతో మాట్లాడారు. అంబోజీపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దుల్ల రమణతోపాటు పలువురిపై టీడీపీలో చేరాలని తీవ్రమైన ఒత్తిడి చేశారని, ఫలించక పోవడంతో అదే పార్టీలో ఉన్న ఒకరిని తాజాగా కండువా వేసి, అంబోజీపేటలో అనేక కుటుంబాలు చేరిపోయాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గురువారం మండలంలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారని, ఆ పార్టీ నాయకులు పలువురికి కండువాలు వేశారన్నారు. వారందరూ గతం నుంచి టీడీపీలో ఉన్న వారేనన్నారు. మడపాంలో ఒక జనసేన అభిమానికి టీడీపీ కండువా వేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్త చేరారని ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు టీడీపీ వాళ్లకు అలవాటేనన్నారు. ఉప్పరిపేట నుంచి ఊరంతా టీడీపీలో చేరిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అంబోజీపేట పోలింగ్ కేంద్రంలో టీడీపీకి ఎప్పుడూ మెజార్టీ రాలేదని, ఇప్పుడు కూడా అదే కొనసాగుతుందన్నారు. నడగాంలో మొదటి నుంచి టీడీపీకి సహకరిస్తున్న వారే ఇప్పుడు ఆ పార్టీ కండువాలు కప్పుకున్నారని, వాస్తవాలు కౌంటింగ్ రోజు బయటపడతాయన్నారు. రాజాపు అప్పన్న, ఎం.కృష్ణ, సడగాన రవి, జాయి శేషు, సతివాడ రామినాయుడు పాల్గొన్నారు.

జామి యాత్రకు భక్తుల తాకిడి



ఎల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామంలో నిర్వహిస్తున్న జామి యాత్రకు బుధవారం రాత్రి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఎల్లమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. యాత్ర మహోత్సవానికి పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన ప్రజలతోపాటు ఒడిశాకు చెందిన పలు గ్రామాల ప్రజలు తరలివచ్చారు.



యాత్రకు తరలివచ్చిన భక్తులు

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్



హిరమండలం: ధనుపురం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం గ్రామం ప్రధాన రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ముమ్మరంగా తనిఖీ నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో శ్రీకాకుళం–పాలకొండ రోడ్డులో గురువారం వాహనాలు తనిఖీలు చేపట్టారు. సివిల్ సప్లయ్ డీటీ ఎస్.వెంకటరావు, ఏఎస్సై వై.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలం మండలంలో..

హిరమండలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. మండలంలోని ధనుపురం, గట్టుబ్యారేజీ, హిరమండలం ప్రధాన రహదారుల్లో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గురువారం వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏఆర్ ఎస్‌ఐ అప్పారావు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసుల శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్తే వాటికి సంబంధించిన పత్రాలు విధిగా చూపాలన్నారు. తనిఖీల్లో పోలీసులకు సహకరించాలని కోరారు.

తామర చెరువును కాపాడాలని వినతి



టెక్కలి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ భగవాన్‌దాసునాయుడు, తదితరులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి తామర చెరువులో భాగమైన బోనంగి చెరువును కాపాడాలని టెక్కలి సబ్ కలెక్టర్‌కు సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, మాజీ సర్పంచ్ ఎద్దు కన్నంనాయుడు తదితరులు గురువారం వినతిపత్రం అందజేశారు. బోనంగి చెరువులో ప్రతిష్ఠంచిన స్తంభం ఉందన్నారు. కొంతమంది రైతులు చెరువులో గోగును ఊరవేశారన్నారు. ఈ చెరువులో కొంత మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ ఫిర్యాదులతో కొన్నిరద్దు చేశారన్నారు. చెరువును కొంతమంది ఆక్రమించికుని దుకాణాలు పెట్టారన్నారు. ఈ చెరువు ఆక్రమణలను పలుసార్లు రెవెన్యూ, పోలీస్ అధికారులు తొలగించారన్నారు. ఈ చెరువు బోనంగి ఇంటి పేరుతో ఉందని, భామిని మండలం సొలికిరిలో ఉన్న ఒక బోనంగి కుటుంబానికి చెందిన పంట భూమిగా రెవెన్యూ అధికారులు నమోదు చేశారన్నారు. దీనిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందించి, స్థానిక రెవెన్యూ అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికను పరిశీలించాలని కోరారు. వందల కోట్లు విలువ చేసిన 2.75 ఎకరాల విస్తీర్ణం గల ప్రభుత్వ చెరువును కాపాడాలని విన్నవించారు. రైతు బజారు, ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం ఈ చెవురును గతంలో కేటాయించిందన్నారు. నిర్మాణ ఖర్చులు ఎక్కవ అవుతాయని నిలుపుదల చేశారన్నారు. అటువంటి చెరువును ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం తగదన్నారు.

నీ ఓటు–నీ భవిష్యత్‌పై అవగాహన



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



కొత్తూరు: కర్లెమ్మలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



పాతపట్నం: పాతపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని నరసన్నపేట ఆర్ఓ రామ్మోహనరావు కోరారు. మండలంలోని జమ్ములో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పిస్తామన్నారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్ కనకారావు, జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్లెమ్మలో..

కొత్తూరు: ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని ఏపీఎం జనార్దనరావు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న నీ ఓటు–నీ భవిష్యత్ కార్యక్రమాన్ని మండలంలోని కర్లెమ్మ గ్రామంలో గురువారం నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సుతోపాటు ర్యాలీని గ్రామ మహిళా సంఘాల సభ్యులతో కలిసి నిర్వహించారు. వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ రాణి అమ్మాజీ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా మీకు నచ్చిన వారికి ఓటు వేయాలన్నారు. ఆర్ఐ గవరయ్య పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని, ఓటే నీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని ఏపీఎం పి.మనోరత్నం అన్నారు. పాతపట్నం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పాతపట్నం ప్రధాన రహదారిపై ర్యాలీ, కోర్టు కూడలిలో మానవహారం చేపట్టారు. ఓటు అవశ్యకతను ఏపీఎం వివరించారు. ఎంఎంఎస్ ఓబీలు శారదమ్మ, శ్రీదేవమ్మ, సీసీఎస్‌లు అప్పలస్వామి, శ్రీధర్, ధర్మారావు, కృష్ణవేణి, ప్రభావతి, సీఓ కిశోర్, వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం



కుంటిభద్ర గ్రామస్తులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: రానున్న సార్వత్రికి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు కోరారు. మండలంలోని కుంటిభద్ర(పాటి)లో గురువారం మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ ఈ ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పాతపట్నం నియోజవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతిని గెలిపించాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పార్టీ తరఫున శ్రీకాకుళం పార్లమెంట్ నియోజవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు గ్రామాలకు వచ్చి చెప్పిన మాయమాటలను నమ్మవద్దన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు అగతమూడి సుశీల, వైఎస్సార్‌సీపీ నాయకుడు అగతమూడి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, కలమట రమేష్‌బాబు, లోతుగెడ్డ తిరుపతిరావు, వనుము లక్ష్మీనారాయణ, గండివసల ఆనందరావు, పంకజ దాస్, గార రాజులునాయుడు తదితరులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస: పట్టణంలోని వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం రాత్రి రమా వెంకట సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కళ్యాణోత్సవంలో బుడుమూరు శ్రీనివాసరావు దంపతులతోపాటు ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.